
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
గురువారం 22 ఆగస్టు 2024



మూడేళ్ల బాలికపై 30 ఏళ్ల వ్యక్తి అత్యాచారం

- ఆడిస్తానంటూ తీసుకెళ్లి ఘాతుకం
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

7

ప్రాణం తీసిన ఈత సరదా

- చెరువులో మునిగి ఇద్దరు బాలురు మృతి
- శుభకార్యానికి వచ్చి మృత్యుఒడిలోకి..



మృతి చెందిన బాలురు

కొండపాక, ఆగస్టు 21 : శుభకార్యం కోసం బంధువుల ఇంటికి వచ్చి సరదాగా చెరువులో ఈతకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు నీట మునిగి మృత్యువాతపడ్డారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరసనగండ్ల గ్రామానికి చెందిన ఆంజనేయులు ఇంట్లో గురువారం గృహప్రవేశం ఉంది. ఈ శుభకార్యానికి ఆయన బంధువులైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన మల్లేశం కుటుంబ సభ్యులు బుధవారం వచ్చారు. ఆంజనేయులు కుమారుడు అరుణ్‌తో కలిసి మల్లేశం కుమారుడు బసవరాజ్ హేమంత్(16), హేమంత్ స్నేహితుడు నిఖిలేష్‌వర్ధన్ (13) గ్రామంలోని చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లారు. ముగ్గురూ చెరువులో ఈత కొడుతూ కొద్ది దూరం వెళ్లగానే హేమంత్, నిఖిలేష్ వర్ధన్ నీటిలో మునిగారు. ఇది గమనించిన అరుణ్ వారిని లాగే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో కేకలు వేశాడు. సమాచారం అందుకున్న గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మృతదేహాలను బయటికి తీసి పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బసవరాజ్ హేమంత్, నిఖిలేష్‌వర్ధన్ మంచి స్నేహితులు. వరుస సెలవులు రావడం శుభకార్యానికి హేమంత్ బంధువుల ఇంటికి ఇద్దరూ కలిసి వచ్చి మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదం నెలకొన్నది. బంధువుల రోదనలు మిన్నంటాయి.



భూమికి పచ్చని రంగేసినట్లు..



పక్క ఫొటోను చూసి ఎక్కడో కోనసీమలోని దృశ్యమనుకుంటే పొరబడినట్లే.. చుట్టూ పచ్చదనంతో కోనసీమ అందాలను తలపిస్తూ ప్రతి ఒక్కరికీ ఆహ్లాదాన్ని పంచుతున్న ఈ దృశ్యాలను బుధవారం అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలోని సంజీవరాయగుట్టపై నుంచి 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో చిత్రీకరించింది. గోవర్ధనగిరి గ్రామప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రజలు గుట్టపై నుంచి ప్రకృతి అందాలను చూడడానికి వస్తున్నారు.

\- అక్కన్నపేట, ఆగస్టు 21

వరిసాగు లక్ష్యం చేరేనా?

- లక్ష్యం 3.79 లక్షల ఎకరాలు
- ఇప్పటి వరకు 2.80 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు
- ముదురుతున్న నారు.. ఆందోళనలో రైతులు



పుల్లూర్‌లో గ్రామంలో ముదిరిపోతున్న వరినారు

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 21: ఈ ఏడాది వరిసాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. వర్షాకాలంలో వచ్చిన మార్పులతో ఈ ఏడాది సాగు గణనీయంగా తగ్గే అవకాశం కనిపిస్తుంది. ఈ వానాకాలంలో 3.79లక్షల ఎకరాల్లో వరిసాగు అయ్యే అవకాశాలు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేసినా పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఐదేళ్ల క్రితం లక్ష ఎకరాల్లోనే వరిసాగు చేయగా.. ప్రతి సంవత్సరం సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తుంది. గత వానాకాలంలో 3.78 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఈసారి కూడా అదే స్థాయిలో సాగు చేస్తారని అంచనా వేసినా ఇప్పటి వరకు 2.80 లక్షల ఎకరాల్లో మాత్రమే వరినాట్లు పూర్తయ్యాయి. ఈ ఏడాది చెరువులు, కాలువల్లో ఆశించిన మేర నీరు లేకపోవడంతో



సాగు విస్తీర్ణం తగ్గినట్లు అధికారులు భావిస్తున్నారు. వర్షాలు కురిస్తే మరో 20, 30 వేల ఎకరాల వరకు వరి నాట్లు వేసే అవకాశాలున్నాయి.

ఆందోళనలో అన్నదాతలు

ఇన్నిరోజులు ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో రైతులు నాట్ల విషయంలో తర్జనభర్జన పడ్డారు. రైతులంతా నారు పోసుకున్నప్పటికీ నీరు ఉన్న రైతులు మాత్రమే నాట్లు వేశారు. జిల్లాలో ఆగస్టు 20 వరకు 408 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా 497.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దాదాపు ఐదు మండలాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. ఆలస్యమవుతున్నా కొద్దీ వరినారు ముదిరిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం ఈ నెలాఖరు వరకు, వరినాట్లు వేసుకోవచ్చని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచిస్తున్నారు. భూగర్భజలాలు పెరిగేందుకు కాలువల ద్వారా చెరువులు, కుంటలను నింపాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సాగుకు నీరందించాలి

- చిటుకుల ప్రసాద్, రైతు, పుల్లూరు



రెండెకరాల్లో వరి నాటు వేశాను. మరో ఎకరానికి సరిపడా నీరు లేక పొలం దున్నలేదు. రెండు బస్తాల నారు ముదిరిపోతుంది. వేసిన నాట్లకు వర్షాలు లేక నీళ్ల సరిగా అందడం లేదు. ప్రభుత్వం కాలువల ద్వారా నీరందించి చెరువులు కుంటలు నింపాలి. అప్పుడే మా పంటలు పండుతాయి.

నీళ్లు లేక మూడెకరాల్లోనే నాటు వేశాం

- శ్రీవర్ధన్ రైతు కామలాయపల్లి



ఆరు ఎకరాల్లో వరి సాగు చేస్తామనుకుని నారు పోశాము. నీరు లేకపోవడంతో కేవలం మూడెకరాల మాత్రమే వరి నాటు వేశాం. వర్షాలు లేకపోవడంతో మరో మూడు ఎకరాలు పొలం దున్నలేదు. నారు ముదిరిపోతుంది. కాళేశ్వర జలాలతో మా ఊరు చెరువు నింపితే దాదాపు 10 గ్రామాల రైతులకు మేలు జరుగుతుంది. లేకపోతే వేసిన పంట కూడా చేతికి రాదు.

బ్లూకోల్ట్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 21 : బ్లూకోల్ట్స్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సీపీ అనురాధ సూచించారు. సిద్దిపేట జిల్లాలో ఉన్న బ్లూ కోల్ట్స్ సిబ్బందికి బుధవారం సీపీ కమిషనరేట్‌లో నూతన ట్యాబ్‌లు అందజేసి మాట్లాడారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో రోజూ ఎన్ని పెట్రోలింగ్‌లు, ఎక్కడెక్కడ ఎన్ని బీట్లు నడుస్తున్నాయని తెలుసుకుని కచ్చితంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ చోరీలు జరగకుండా జాగ్రత్త పడాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలన్నారు. బ్లూకోల్ట్స్ పెట్రోలింగ్ 24 గంటలూ గస్తీ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్ మల్లేశంగౌడ్, ఐటీకోర్ ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, బ్లూకోల్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.



బ్లూ కోల్ట్స్ సిబ్బందితో సీపీ అనురాధ

బంద్ సంపూర్ణం

- ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్‌బంద్
- బస్సులు నడవకుండా దళిత సంఘాల ధర్నా

సిద్దిపేట టౌన్, ఆగస్టు21: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ది రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి ఇచ్చిన భారత్‌బంద్ పిలుపు మేరకు బుధవారం సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా బంద్ సంపూర్ణంగా కొనసాగింది. ఉదయం నుంచి బస్సులు బయటకు రాకుండా డిపోల వద్ద ఎస్సీ, మాల సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. సిద్దిపేటలో బైక్ ర్యాలీ నిర్వహించి పలు దుకాణాలను మూసివేయించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ మద్దెల నర్సింలు ఆధ్వర్యంలో మాల మహానాడు నాయకులు సిద్దిపేట పట్టణంలో బంద్ నిర్వహించారు. శాంతియుత వాతావరణంలో బంద్‌కు సహకరించిన వాణిజ్య వ్యాపార, ప్రైవేట్ విద్యాసంస్థలకు వివిధ సంఘాలకు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘాల అధ్యక్షుడు గ్యాదరి రామస్వామి, మాల సదర సంఘం అధ్యక్షుడు ఎర్ర పురుషోత్తం, నాయకులు గ్యాదరి వెంకటస్వామి, మెరుగు మహేష్, గ్యాదరి జగన్, కోదాడి శ్రీనివాస్, గ్యాదరి రాజారాం, శంకర్, గ్యాదరి మల్లేశం, ఎల్లేష్, సామల గణేష్ పాల్గొన్నారు.

బంద్‌కు బీఎస్పీ మద్దతు

బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కటికల ఓంప్రకాష్ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి కొత్త బస్టాండ్, హౌసింగ్ బోర్డు, విక్టరీ చౌరస్తా, కమాన్ రోడ్డులో బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు.



సిద్దిపేటలో బస్సులు బయటకు రాకుండా డిపో ఎదుట బైఠాయించిన ఎస్సీ మాల సంఘం నాయకులు

7

మేనమామను పెళ్లాడుతానన్న కుమార్తె.. మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

పల్లెల్లో పంచాయతీ సందడి



దుబ్బాక/తొగుట, ఆగస్టు21: గ్రామపంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిన నేపథ్యంలో పల్లెల్లో సందడి మొదలైంది. బుధవారం తెలంగాణ ఎన్నికల సంఘం పంచాయతీల ఓటరు జాబితాకు షెడ్యూల్ విడుదలకు చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ వరకు అన్ని ప్రక్రియలను పూర్తి చేసి సిద్ధంగా ఉంచాల్సిన అవసరముందని ఆదేశించింది. 2019 జనాభా లెక్కల జిల్లాలో 499 గ్రామపంచాయతీలల్లో 5,150 వార్డులు ఉన్నాయి. ఓటరు తుది జాబితా తరువాత మరో 150 నుంచి 200 వార్డులు అదనంగా పెరిగే అవకాశం ఉంది. బుధవారం ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈనెల ఆగస్టు 29 నుంచి జిల్లా స్థాయిలోని అధికారులందరితో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్, వచ్చే నెల సెప్టెంబరు 6 వరకు ఓటరు జాబితా ముసాయిదాను ప్రచురించాల్సి ఉంటుంది. ఓటరు జాబితాపై అదే నెలలో 7 నుంచి 13 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. 9న జిల్లా స్థాయి రాజకీయ నేతలతో, 10న మండల స్థాయి నేతలతో సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. 19న అభ్యంతరాల పరిష్కరణ ఉంటుంది. సెప్టెంబర్ 21న వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నారు. తదనంతరం ఎన్నికల నోటిఫికేషన్ వరకు మార్పులు, కొత్త ఓటర్లను చేర్చడం, తీసివేయడం లాంటి ప్రక్రియ కొనసాగుతుంది.

మొదలైన రాజకీయ వేడి..

తాజా షెడ్యూల్ ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్ ఎంతో దూరం లేదనే ఆశలు గ్రామస్థాయిలో పోటీ చేసే ఆశావాహుల్లో నెలకొన్నది. దీంతో గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంది. రిజర్వేషన్ ఖరారు కాకపోయినప్పటికీ గతంలో ఉన్న రిజర్వేషన్ ఉంటుందని కొందరు సర్పంచ్ పదవికి పోటీపడే ఆశావహులు కులసంఘాల నేతలను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తొగుట మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉండగా అందులో ఎక్కువ పంచాయితీలు బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులు గెలుపొందారు. అందులో నుంచి ఆరు పంచాయతీలు ఇటీవల మల్లన్నసాగర్‌లో ముంపునకు గురికాగా ఆయా గ్రామాలను గజ్వేల్ సమీపంలో నిర్మించిన ముట్రాజ్‌పల్లి ఆర్అండ్ఆర్ కాలనీకి తరలించిన విషయం తెలిసిందే. మండలంలో ఇటీవలి వరకు సర్పంచ్‌గా, ఎంపీటీసీలుగా పనిచేసిన చాలా మంది బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరారు. మరికొందరు బీజేపీ కండువ కప్పుకున్నారు. ఎలాగైనా ఈసారి పట్టు సాధించడం కోసం కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తుండగా, పరువు కోసం బీఆర్ఎస్ నేతలు, ఉనికి కోసం బీజేపీ నేతలు ఎవరికి వారు ఇప్పటికే పావులు కదుపుతున్నారు.

చారిత్రాత్మకం రూ.2 లక్షల రుణమాఫీ

- నిబంధనల మేరకు అర్హులందరికీ రుణమాఫీ
- పల్లె దవాఖానాలు సద్వినియోగం చేసుకోవాలి
- గ్రామాల్లో స్టీల్‌బ్యాంకుల ఏర్పాటు
- మంత్రి పొన్నం ప్రభాకర్

వర్గల్/హుస్నాబాద్/కోహెడ ఆగస్టు 21: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అమలు చేసిన రూ.2లక్షల పంట రుణమాఫీ దేశంలోనే చారిత్రాత్మకమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వర్గల్ మండలం గౌరారంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమ లు చేస్తుండడంతో ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేక రాద్ధాం తం చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఒరగబెట్టింది ఏం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ బాగనోల్ల మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు భానుప్రసాద్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలి

కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ అనుబంధ పథకలపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి ప్రభాకర్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో జరిగిన నియోజకవర్గస్థాయి వ్యవసాయశాఖ అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ కాని రైతుల సమస్యల పరిష్కారానికి వారి నుంచి ఫిర్యాదులు తీసుకొని పరిష్కరించాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా నీటిని వచ్చే సీజన్‌లోపు అందిస్తామన్నారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రుణమాఫీపై వస్తున్న సమస్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఏవోలు, ఏఈవోలు, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆరోగ్యఉపకేంద్రాలు, ఓపెన్ జిమ్‌లు

నియోజకవర్గంలోని 30 గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు నిర్ణయించినట్లు బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం కోహెడ మండలంలోని బస్వాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని కలెక్టర్ మనుచౌదరితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో వ్యాధులు విజృంభిస్తున్నాయని డాక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 100 శాతం గ్రామాల్లో 500 మంది ఒకేసారి తినే విధంగా స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ఆనంద్, వైద్యాధికారి నిమ్రా, వివిధ శాఖ అధికారులు ఉన్నారు.




కోహెడ మండలం బస్వాపూర్‌లో బీపీ చెక్ చేయించుకుంటున్న మంత్రి పొన్నం

శవానికి కులబహిష్కరణ

- తనువంతా సామాజిక న్యాయంపై పోరాటం
- తనువు చాలించాక దరి చేరని ఆ నలుగురు
- మాజీ నక్సలైట్ అంత్యక్రియలకు రాని కులస్థులు
- భూవివాదంలో కులబహిష్కరణ
- డప్పు కొట్టేందుకూ రాని వైనం
- సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బండమీది సాయిలు దుస్థితి

దుబ్బాక, ఆగస్టు 21 : ఆయన నక్సల్ ఉద్యమ తొలితరం నాయకుడు... సామాజిక న్యాయం, కులవివక్షలపై పోరాటం చేసిన ఉద్యమకారుడు... అప్పటి పీపుల్స్‌వార్ పార్టీలో కీలకంగా పని చేసిన క్రియాశీలక మిలిటెంట్... రాజకీయ చైతన్యం కలిగిన ఆయనకే కులపోరు తప్పలేదు. తనువంతా ఏదైతే కులవివక్ష కోసం పోరాటం చేశారో..? అదే కులం తనువు చాలించాక ఆయన మృతదేహం వద్ద కనీస డప్పు కొట్టేందుకూ రాలేదు. ఇది సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం బొప్పాపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బండమీది సాయిలు తొలితరం పీపుల్స్‌వార్ ఉద్యమంలో కీలకంగా పని చేశారు. 1987లో పీపుల్స్‌వార్ పార్టీ దుబ్బాక దళంలో కమేండర్ నాగన్న నేతృత్వంలో పని చేశారు. పీపుల్స్‌వార్ అనుబంధమైన రైతుకూలి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా సాయన్న అలియస్ మల్లన్న పేరుతో క్రియశీలకంగా పని చేశారు. వరంగల్ సభకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 1991లో భారీ జనసమీకరణ జరిపారు. 1992లో రామన్న దళంలోనూ ఆయన పని చేశారు. అనంతరం అరెస్టు అయిన సాయిలు సామాజిక ఉద్యమాలల్లో పని చేశారు. అజ్ఞాతంలోకి వెళ్లకుండా రైతుకూలీ పోరాటాలు, జనసమీకరణలతో పార్టీకి సానుభూతిపరుడిగా పని చేశారు. ఆతరువాత కాలంలో అనేక ప్రజాకోర్టుల్లో పార్టీ ఇచ్చిన తీర్పులను అమలు చేస్తూ వచ్చారు. అంతేగాక మాదిగ దండోరా ఉద్యమం, కులవివక్ష పోరాటాలల్లో పని చేశారు. ఆయన 1996లో కాంగ్రెస్ పార్టీలో చేరి, క్రియశీలక కార్యకర్తగా పని చేస్తున్నారు. ఆయన సోదరుడు మల్లయ్య భార్య బాలమణి గ్రామానికి తాజామాజీ సర్పంచ్‌గా కొనసాగారు. ఐతే గ్రామంలోని తన కులస్తులకు, సోదరుడు మల్లయ్యకు సాయిలుకు మధ్య భూవివాదం నెలకొంది. దీంతో 2021లో బండమీది సాయిలు కుటుంబం కులబహిష్కరణకు గురయ్యింది. ఈవిషయంలో కలెక్టర్, పోలీస్ అధికారులను సాయిలు సోదరులు ఆశ్రయించారు. చివరికి గ్రామంలోనే పరిష్కరించుకుని గ్రామపెద్దలకు, కులసంఘానికి జరిమానా చెల్లించి, యథాపరిస్థితిని కొనసాగించాలని తీర్మానించుకున్నారు. అయితే, అధికారులు, గ్రామస్థుల ముందు కులస్తులు అంగీకరించినా తర్వాత ఈ కుటుంబంతో అంటిముట్టనట్టుగానే ఉన్నారు. మంగళవారం సాయిలు అనారోగ్యంతో మరణించగా, కులస్తులు మృతదేహం వద్దకు రావడానికి నిరాకరించారు. శవయాత్రకు కూడా డప్పు కొట్టడానికి నిరాకరించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువర్గాలతో చర్చించినా ఫలితం లేకుండా పోయింది. కనీసం డప్పు కొట్టడానికైనా రావాలని పోలీసులు కోరినా ఫలించలేదు. దీంతో పక్క గ్రామాలనుంచి డప్పులను తెప్పించి, అంత్యక్రియలు నిర్వహించారు. తమను గ్రామంలో తమ కులస్తులు అన్ని విధాలుగా వేధిస్తున్నారని, సమాజానికి సేవచేసిన తమ మరిది అంత్యక్రియలకైనా రావాలని కోరిన ఫలితం లేదని గ్రామ తాజా మాజీ సర్పంచ్ బండమీది బాలమణి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతికి కాంగ్రెస్ నాయకులు కటికె బాల్‌రాజ్, బెల్లె బాల్‌నర్సయ్య, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఇస్తారిగల్ల ఎల్లం, జింక కనకయ్య సంతాపం తెలిపారు.



బండమీది సాయిలు(ఫైల్)

సమన్వయంతో మాదకద్రవ్యాలను నిర్మూలించాలి

- పెయిన్ కిల్లర్స్‌లో నిషేధిత డ్రగ్స్ ఇచ్చే

ఆర్ఎంపీలపై నిఘా ఉంచాలి : కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 21: మాదకద్రవ్యాల నిర్మూలనకు అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాల నియంత్రణ జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ మాట్లాడారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటివరకు 28 గంజాయి కేసులు నమోదైనట్లు తెలిపారు. సిద్దిపేట వన్‌టౌన్, గజ్వేల్, ములుగు, గౌరారం పోలీస్‌స్టేషన్లో పరిధిలో ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీల ద్వారా రెండు, మూడు కిలోలుగా గంజాయిని తీసుకొచ్చి ఇక్కడి లేబర్లకు విక్రయిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. హుస్నాబాద్ ప్రాంతంలో గంజాయి, మత్తు పదార్థాలు కలిపిన బిస్కెట్లు, నల్లబెల్లం అక్కడక్కడ కనిపిస్తున్నట్లు స్పష్టం చేశారు. సిద్దిపేట లో ఓ ఆర్ఎంపీ డాక్టర్ పెయిన్ కిల్లర్‌లో మాదకద్రవ్యాలను మిక్స్ చేసి ఇస్తూ అనుమానం ఉందన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో సంబంధిత శాఖల సపోర్టు అవసరమని ఆమె తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల ప్రభావానికి జిల్లా ప్రజలు దూరంగా ఉండేలా పోలీస్, విద్యా, వైద్య ఆరోగ్య, ఎక్సైజ్, వ్యవసాయ, డ్రగ్స్ నియంత్రణ, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. పాఠశాలలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై చిన్నారులకు క్విజ్, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలను నిర్వహించాలని సూచించారు. చాకెట్లలో కూడా డ్రగ్స్ కలిపి విక్రయిస్తున్నారని, పాఠశాలలకు వంద మీటర్ల వరకు చాక్లెట్లు అమ్మే దుకాణాలను తొలగించాలని ఆయన ఆదేశించారు. పెయిన్ కిల్లర్స్‌లో నిషేధిత డ్రగ్స్ కలిపి ఇచ్చే ఆర్ఎంపీలపై నిఘా ఉంచాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులైనా, సమాచారమైనా 1908కు అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాస్, సిద్దిపేట, గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, సిద్దిపేట ఏసీపీ మధు, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి మహేష్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ సుష్మి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి, పక్కన సీపీ అనురాధ

వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం

మెదక్ అర్బన్, ఆగస్టు 21: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో వేలం పాట నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఇందుకు సంబంధించి ముందుగానే ప్రకటన చేయడంతో జిల్లా నలుమూలల నుంచి పలువురు వేలం పాటలో పాల్గొనేందుకు తరలివచ్చారు. ఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం పాటలో ముందుగా పోలీసులు పాటదారుల నుంచి డిపాజిట్ కట్టించుకొని టోకెన్లు అందజేశారు. 103 వాహనాలకు మొత్తం రూ.6,95,000 రాగా... వాటిని ప్రభుత్వ ఖాతాలో జమ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ, సీఐ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ పైనుంచి పొలాలకు వెళ్లొద్దు


పనులను అడ్డుకుంటున్న రైతులు

కుకునూరుపల్లి, ఆగస్టు 21: రైల్వే ట్రాక్ పైనుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లవద్దని రైల్వే అధికారులు అనడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వేకు భూములు ఇచ్చిన తమకే ప్రవేశం లేదని అనడం సబబు కాదని మండిపడ్డారు. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు రైల్వేలైన్‌కు అనుమతులు వచ్చాయి. కుకునూరుపల్లి రైతు వేదిక ముందున్న లక్ష్మిచెరువు మీదుగా రైల్వే ట్రాక్‌ను నిర్మించారు. చెరువుకట్ట మీద నుంచి రైల్వేట్రాక్ దాటుకుని అవతలి వైపు దాదాపు 60 మంది రైతులకు సంబంధించిన 150 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. అయితే రైల్వే ట్రాక్ పైనుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి అనుమతి లేదని రైల్వే అధికారులు పలు మార్లు రైతులకు సూచించారు. బుధవారం రైల్వే అధికారులు వచ్చి ట్రాక్ ఇరువైపులా గొయ్యి తీసిపోయారు. అటువైపు వెళ్లే రైతులు చూసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వేలైన్‌కు భూములు ఇచ్చిన తమకే దారి ఇవ్వరా అని ప్రశ్నించారు. రైల్వే అధికారులు మాట్లాడుతూ ఎంపీని కానీ, దక్షిణ మధ్య రైల్వే అధికారిని కానీ కలిసి సమస్యను తెలియజేయాలని తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

కళాశాల వద్ద బస్సులు ఆపాలని ఆందోళన


జిన్నారం కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

జిన్నారం, ఆగస్టు 21: జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆర్టీసీ బస్సులు ఆపాలంటూ విద్యార్థులు ఆందోళన చేశారు. బుధవారం జూనియర్ కళాశాల ప్రధాన రహదారిపై విద్యార్థులు బైఠాయించి, బస్సులను అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులకు ప్రయాణించే అవకాశం లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయమై అయా డిపోల్లో పత్రాలు ఇచ్చినా స్పందించడం లేదంటూ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల వద్ద అన్ని బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


లక్ష్మణ్(ఫైల్)

కంగ్టి, ఆగస్టు 21: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని తుర్కవడగాం శివారులో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల్‌పాడ్ గ్రామానికి చెందిన మాల లక్ష్మణ్(62) తుర్కవడగాంలో ఉన్న కూతురు ఇంటి నుంచి స్వగ్రామమైన గాజుల్‌పాడ్‌కు నడుచుకుంటూ వెళ్తున్నాడు. గ్రామ శివారులోని దాబా వద్ద (టీఎస్ 15 ఈటీ 1688) నెంబరు గల కారును డ్రైవర్ వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ నడుచుకుంటూ వెళ్తున్న లక్ష్మణ్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

ఆర్టీసీకి రాఖీ పండుగ ఆదాయం రూ.5.12 కోట్లు

- మెదక్ రీజియన్‌కు భారీగా సమకూరిన ఆదాయం
- ఈ నెల 18 నుంచి 20వ తేదీవరకు ప్రత్యేక బస్సులు


సంగారెడ్డి కొత్త బస్టాండ్‌లో రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21: సోదరులకు రాఖీలు కట్టేందుకు లక్షలాది మంది అక్కా చెల్లెళ్లు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. మహాలక్ష్మి పథకం రాక ముందు ఆటోలు, జీపులు, ప్రైవేటు వాహనాలు.. ఏదీ అందుబాటులో ఉంటే ఆ వాహనంలో ప్రయాణించే వారు. మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడంతో ఆర్టీసీ బస్సులనే ఆశ్రయించారు. రాఖీ పండుగను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ ముందస్తు ప్రణాళికలు రూపొందించి ప్రత్యేక బస్సులు నడిపింది. మొత్తంగా రక్షాబంధన్ పర్వదినం ఆర్టీసీకి కలిసొచ్చిందని చెప్పవచ్చు.

రీజియన్‌కు రూ.5.12 కోట్ల ఆదాయం

రాఖీ పండుగను పరస్కరించుకొని ఆర్టీసీ 18 నుంచి 20వ తేదీవరకు నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరింది. మెదక్ రీజియన్‌కు రూ.5.12 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో సిద్దిపేట డిపోకు రూ.కోటి 40 లక్షలు, జహీరాబాద్ రూ.83.45 లక్షలు, మెదక్ రూ.78.61 లక్షలు, సంగారెడ్డి రూ.72.87 లక్షలు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రూ.68.57 లక్షలు, నారాయణఖేడ్ రూ.49.67 లక్షలు, దుబ్బాక రూ.39.86 లక్షలు, నర్సాపూర్ రూ.14.45 లక్షల ఆదాయం వచ్చిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోలో సంబరాలు

గజ్వేల్, ఆగస్టు 21: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఆక్యుపెన్సీలో అగ్రస్థానంలో నిలవడంతో డిపో మేనేజర్ పవన్ ఆధ్వర్యంలో సంబరాలు చేస్తున్నారు. సిబ్బందికి, అధికారులకు మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా సిబ్బందికి, డిపో అధికారులకు డీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఆయనవెంట డిపో అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, ఎంఎఫ్ జమీల్, కంట్రోలర్స్, కండక్టర్లు, డ్రైవర్లు ఉన్నారు.


గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోలో సంబరాలు చేసుకుంటున్న మేనేజర్, సిబ్బంది


కాజీపల్లి పారిశ్రామికవాడ సమీపంలో కాలువలో చేరిన వ్యర్థ రసాయనాలు


కిష్టయ్యపల్లిలో కాలుష్య జలాలు తాగి మృతిచెందిన పాడిగేదె వద్ద బాధిత కుటుంబసభ్యులు

మూగజీవాల మృత్యుఘోష

పాడిగేదెలు, మేకల ప్రాణాలు తీస్తున్న కాలుష్య జలాలు

- 15 రోజుల వ్యవధిలో ఎనిమిది గేదెలు మృతి
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు
- చోద్యం చూస్తున్న పీసీబీ అధికారులు

జిన్నారం, ఆగస్టు 21: జిన్నారం మండల పారిశ్రామికవాడల్లో పరిశ్రమల రసాయన వ్యర్థ జలాలు మూగజీవాల పాలిట మృత్యు జలాలుగా మారాయి. నోరు లేని మూగజీవాలైన పాడి గేదెలు, మేకలు కలుషిత జలాలు తాగి మృత్యువాత పడుతున్నాయి. కేవలం 15 రోజుల వ్యవధిలో గడ్డపోతారం, కాజీపల్లి గ్రామాల్లో పాడి గేదెలు కాలుష్య జలాలు తాగి మరణించగా.. వాటిపై ఆధారపడ్డ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పరిశ్రమల ధన దాహంతో బహిరంగ ప్రాంతాలకు వ్యర్థ రసాయనాలు వదిలేయగా చెరువులు, కుంటల్లో చేరిన కలుషిత నీటిని తాగి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి.

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని గడ్డపోతారం, కాజీపల్లి, బొల్లారం ప్రాంతాల్లో తరచూ కాలుష్య రసాయన వ్యర్థాలు తాగి మూగజీవాలు మరణిస్తున్నాయి. పరిశ్రమలు నిత్యం బహిరంగ ప్రాంతాల్లో రసాయన జలాలు వదిలేయగా.. మేత కోసం వెళ్లే జీవిలు దాహం తీర్చుకునేందుకు వాటిని తాగి మరణిస్తున్నాయి. మూడు దశాబ్దాలుగా ఆ ప్రాంతంలో ఈ సమస్య నెలకొన్నది. ఇటీవల కురుస్తున్న వర్షపు నీటిలో కొన్ని పరిశ్రమలు వ్యర్థాలను వదిలేయగా.. ఇటీవల కాజీపల్లికి చెందిన ఇద్దరు రైతులకు చెందిన మూడు పాడిగేదెలు మరణించాయి. ఈ నెల 20 గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లికి చెందిన యువ రైతు బసెట్టి సాయికుమార్‌కు చెందిన రెండు పాడిగేదెలు మరణిచగా, 21న మూడు పాడిగేదెలు మృత్యువాత పడగా.. మరో నాలుగు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. కాగా పరిశ్రమల నిర్లక్ష్యంతో నీటి వనరులు కలుషితమై మూగజీవాలు తరచూ మరణిస్తున్నాయని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. పారిశ్రామికవాడల సమీపంలోని గ్రామాల జలాశయాలు పూర్తిగా కాలుష్య కోరల్లో చిక్కుకుని అందులోని నీరు సహ భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. ఇక పాడి గేదెల పోషణతో జీవనం సాగిస్తున్న చాలామంది ఈ ప్రాంత రైతులకు వ్యర్థ జలాలతో నష్టం కలుగుతున్నది. కాలుష్య సమస్యను పరిష్కరించాల్సిన పీసీబీ అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా మారుతోంది.

పాడిగేదెల మృతితో రూ.7 లక్షల నష్టం

పాడిగేదెల పోషణపై ఆధారపడి జీవిస్తున్న తమకు పరిశ్రమల నుంచి వ్యర్థ రసాయనాలతో తీవ్ర నష్టం కలుగుతుందని బాధిత రైతు బసెట్టిగారి సాయికుమార్ అన్నాడు. రెండురోజుల వ్యవధిలో తన ఐదు గేదెలు మృతిచెందగా.. మరో 4 ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయని ఆవేదన చెందాడు. మృతిచెందిన ఐదు పాడిగేదెల విలువ రూ.7 లక్షల వరకు ఉంటుందని, తనకు న్యాయం చేయాలని, జలాశయాల్లోకి రసాయన వ్యర్థాల ప్రవాహాన్ని నియంత్రించాలని కోరాడు.

మల్లేశం స్వీయ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 21: హుస్నాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మేర మల్లేశం స్వయచరిత్ర, పోరాట పాటలపై డాక్టర్ కె.ముత్యం సంపాదకుడిగా, కవి అన్నవరం దేవేందర్ రాసిన పుస్తకాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాటంలో మేర మల్లేశం పాత్రను మంత్రి గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ హౌజ్ ఫెడ్ ఛైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ అక్కు శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీసీబీ కార్యాలయం ఎదుట కిష్టయ్యపల్లివాసుల ధర్నా

జిన్నారం, ఆగస్టు 22: పరిశ్రమల కాలుష్య జలాలు తాగి, ఒకే రైతుకు చెందిన ఐదు గేదెలు మరణించడంతో ఆగ్రహం చెందిన కిష్టయ్యపల్లి వాసులు సనత్‌నగర్‌లోని పీసీబీ కేంద్ర కార్యాలయం ఎదుట మృతిచెందిన గేదెలతో ధర్నా నిర్వహించారు. గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లి గ్రామానికి చెందిన యువరైతు బాశెట్టి సాయికుమార్ పాడిగేదెలు మంగళవారం మేతకు వెళ్లి రసాయన వ్యర్థ జలాలు తాగి రెండు మృతిచెందగా.. బుధవారం మరో మూడు మృతిచెందాయి. మరో నాలుగు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బాధిత రైతు కుటుంబం, స్థానిక నాయకులు మృతిచెందిన పాడిగేదెల మృతదేహాలతో తరలివెళ్లి పీసీబీ కేంద్ర కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పరిశ్రమలు బాధ్యతారాహిత్యంగా కాలుష్య జలాలను బహిరంగ ప్రాంతాలకు వదిలి వేయడంతో జలాశయాలు కలుషితమవుతున్నాయని ఆందోళన చేశారు. మూగజీవాలు మేతకు వెళ్లి కలుషిత జలాలు పడుతున్నాయని, ఇందుకు బాధ్యులైన పరిశ్రమలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సాయికుమార్‌కు గేదెల మృతితో రూ.7 లక్షల నష్ట వచ్చిందని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పీసీబీ అధికారులు ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ప్రకాశంచారి, నీరుడి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బాశెట్టి రాజు, నాయకులు పెంటేష్, వేణు, కుమార్, మాజీ వార్డుసభ్యులు, మహిళలు పాల్గొన్నారు.


సనత్‌నగర్‌లోని పీసీబీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కిష్టయ్యపల్లివాసులు

భారీ వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లు

- సందర్శించిన అధికారులు


రుక్మాపూర్‌లో కూలిన ఇల్లు

చేగుంట, ఆగస్టు 21: మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చేగుంట మండలంలోని పలు గ్రామాల్లో పురాతన ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మండలంలోని 77.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. పలు గ్రామాల్లో కొంతమేరకు చెరువు, కుంటల్లో వర్షపునీరు చేరింది. భారీ వర్షానికి మండలంలోని రుక్మాపూర్‌లో మ్యాకల పెంటమ్మ, కట్ట రేణుక, శ్రీరాం నర్సింహులు, ఉల్లి తిమ్మాయిపల్లిలో కమ్మరి కమలమ్మ, పోలంపల్లిలో కొండి నాగమ్మతో పాటు పలు గ్రామాల్లో ఇళ్లు దెబ్బతినడంతో అధికారులు ఆయా గ్రామాలను సందర్శించారు. దెబ్బతిన్న ఇళ్లలో ఉండొద్దని, పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలో సమస్యలు తలెత్తితే వెంటనే పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. మక్కరాజిపేట్ రోడ్డులో గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ చుట్టూ వర్షపునీరు చేరడంతో మోటార్ల సహాయంతో బయటకు పంపిస్తున్నారు.

రాజస్థాన్ ప్రభుత్వ అడ్వకేట్ ఆన్ రికార్డుగా ఉదయ్‌కుమార్‌సాగర్


ఉదయ్‌కుమార్‌సాగర్

నారాయణఖేడ్, ఆగస్టు 21: రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ ఆన్ రికార్డుగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన శెట్టి ఉదయ్‌కుమార్‌సాగర్‌ను నియమిస్తూ రాజస్థాన్ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కుమార్‌జైన్ ఉత్తర్వులు జారీచేశారు. ఉదయ్‌కుమార్ సాగర్ నారాయణఖేడ్ డివిజన్‌లోని నాగల్‌గిద్ద మండలం గూడురుకు చెందిన దివంగత న్యాయవాది మాధవరావుసాగర్ కుమారుడు. ఉదయ్‌కుమార్‌సాగర్ న్యాయవాద పట్టా పొందగానే సుప్రీంకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఇప్పటికే ఆయన హర్యానా ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌గా, సెంట్రల్ క్రికెట్ బోర్డు అడ్వకేట్ ఆన్‌రికార్డుగా, కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ ఏజెన్సీ ప్యానెల్‌లోను పనిచేస్తున్నారు. బొట్స్వాన దేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రతినిధిగా కూడా పనిచేస్తున్నారు. తాజాగా రాజస్థాన్ ప్రభుత్వం తరఫున సుప్రీం కోర్టులో వాదించడానికి అడ్వకేట్ ఆన్ రికార్డుగా కూడా ఆ ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలోనే మారుమూల ప్రాంతంలో జన్మించిన శెట్టి ఉదయ్‌కుమార్‌సాగర్‌ను రాజస్థాన్ ప్రభుత్వం అడ్వకేట్ ఆన్ రికార్డుగా నియమించడం పట్ల ఆ ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కిడ్నాప్‌కు గురైన యువతిని కాపాడిన పోలీసులు


కిడ్నాప్ చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మద్దూరు, ఆగస్టు 21: కిడ్నాప్‌కు గురైన యువతిని పోలీసులు కాపాడారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం గాగిళ్లాపూర్ హామ్లేట్ గ్రామం జల్లెగూడెంలో బుధవారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ షేక్ మహబూబ్ వివరాల ప్రకారం.. ములుగు జిల్లా ఏటూరునాగరం మండలం గూగుల్లపల్లి గ్రామానికి చెందిన తీగల రాజశేఖర్‌రెడ్డి(30), హన్మకొండ జిల్లా వేలేరు మండలం ఎర్రవెల్లి గ్రామానికి చెందిన నాలీబాల శిరీష(23) హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఆస్పిరో ఫార్మాసూటికల్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఈ నెల 20న రాజశేఖర్‌రెడ్డి శిరీషకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం గాగిళ్లాపూర్ హామ్లేట్ గ్రామం జల్లెగూడెంలోని తన స్నేహితుడి ఇంటికి తీసుకొచ్చాడు. రాజశేఖర్‌రెడ్డి ప్రవర్తనలో మార్పును గమనించిన యువతి 100 నంబరుకు కాల్‌చేసి తాను కిడ్నాప్‌కు గురైనట్లు తెలిపింది. వెంటనే స్పందించిన మద్దూరు పోలీసులు ఎస్‌ఐ షేక్ మహబూబ్ ఆదేశాలతో ఏఎస్‌ఐ జగదీశ్వర్ సిబ్బందితో కలిసి జల్లెగూడెం చేరుకుని ఇరువురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అప్పటికే కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదై ఉందని తెలిపారు. ఈ విషయమై కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. 100 కాల్‌కు స్పందించి యువతిని కాపాడిన పోలీసులను సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ అభినందించారు.

దాశరథి నేటి యువతకు స్ఫూర్తి: సుద్దాల అశోక్‌తేజ


మాట్లాడుతున్న ప్రముఖ సినీ గేయ కవి సుద్దాల అశోక్‌తేజ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21: నవయుగ వైతాళికుడు దాశరథి నేటి యువతకు స్ఫూర్తి అని ప్రముఖ సినీ గేయ కవి సుద్దాల అశోక్‌తేజ కొనియాడారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య అకాడమీ మహాకవి 'దాశరథి జీవితం-సాహిత్యం సమాలోచనలు' అనే అంశంపై కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ నిజాం సర్కార్ ద్వారా శిక్షించబడి, అనంతరకాలంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మహాకవి దాశరథిని ఆస్థాన కవిగా చేసి ప్రభుత్వం గౌరవించిందన్నారు. దాశరథి వ్యక్తిత్వం, జీవితం, సాహిత్యాల గురించి జమిలీగా ప్రసంగిస్తూ ఉద్యమ కవిగా, ప్రబోధ కవిగా, శృంగార కవిగా దాశరథిలోని పలు పార్శ్వాలను స్పృశిస్తూ సభకు హాజరైన విద్యార్థుల మానసిక వికాసాన్ని దృష్టిలో ఉంచుకొని అద్భుతంగా ప్రసంగించారు. అనంతరం తెలుగు సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో దాశరథి జీవితంపై కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, డా.నాలేశ్వరం శంకరం, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై డీఎల్పీవో ఆగ్రహం

- కంది పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు
- వారంరోజుల్లో మార్పు కనపడకపోతే చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కందిలోని డంపింగ్‌యార్డు వద్ద పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎల్పీవో అనిత

కంది, ఆగస్టు 21: ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన 'అటకెక్కిన తడి,పొడి చెత్త సేకరణ' అనే కథనానికి సంగారెడ్డి డీఎల్పీవో అనిత స్పందించారు. కందిలోని డంపింగ్‌యార్డును, అసైన్డ్ భూమిలో పారబోస్తున్న చెత్తను ఎంపీవో మహేందర్‌రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. డంపింగ్‌యార్డు వద్ద తడి, పొడి చెత్తలను వేరుచేయడం లేదని గుర్తించారు. డంపింగ్‌యార్డులో ఎరువు తయారుచేసిన దాఖలాలు లేవని ఆమె గమనించారు. తడి చెత్తతో ఎరువు తయారు చేయడంలో, ప్లాస్టిక్ కవర్లను నిషేధించడంతో పాటు పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేదని కంది పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌కు షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ కంది గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ జరగడం లేదన్నారు. డంపింగ్‌యార్డు పరిసరాలు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. పారిశుధ్య నిర్వహణలో లోపం కొట్టొచ్చినట్టు కనపడుతుందన్నారు. తాను మరో వారంరోజుల్లో కందిని సందర్శిస్తానని, పారిశుధ్య నిర్వహణలో మార్పు కనపడకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌ను డీఎల్పీవో హెచ్చరించారు.

మేనమామను పెళ్లాడుతానన్న కుమార్తె.. మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య


రాజు(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 21: కూతురు తన సొంత మేనమాను వివాహం చేసుకుంటాననడంతో మనస్తాపం చెందిన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్లితే హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన కాటవేని రాజు (40)కు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టులో గుడాటిపల్లి గ్రామం ముంపునకు గురికావడంతో ప్రభుత్వం అందించిన పరిహారం, ప్యాకేజీ డబ్బులతో పోతారం(ఎస్)లో భూమి కొనుగోలు చేసి నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. తను మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కూతురు వివాహమైంది. కాగా, చిన్న కూతురు తన సొంత మేనమామను వివాహం చేసుకుంటానని తండ్రితో చెప్పింది. ఇది నచ్చని రాజు మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి సమీపంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని బలవన్మారణానికి పాల్పడ్డాడు. రాజు భార్య స్వరూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పీఏసీఎస్ నిధుల దుర్వినియోగంపై విచారణ

టేక్మాల్, ఆగస్టు 21: టేక్మాల్ సొసైటీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని జిల్లా డీసీవోకు డైరెక్టర్లు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై బుధవారం మండల కేంద్రమైన టేక్మాల్ సొసైటీ కార్యాయలంలో స్పెషల్ అధికారి, ఆర్డీవో రమాదేవి విచారణ చేపట్టారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఛైర్మన్, డైరెక్టర్లతో సమావేశం నిర్వహించి నిధుల దుర్వినియోగంపై ఆరాతీశారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన పత్రాలను అందజేయాలని సీఈవో వేణుగోపాల్‌కు తెలిపారు. నిధులు దుర్వినియోగం అయినట్లు రుజువైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందులో సొసైటీ ఛైర్మన్ యశ్వంత్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ వెంకయ్య, డైరెక్టర్లు శ్రీశైలం, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, పాపయ్య తదితరులు ఉన్నారు.

మూడేళ్ల బాలికపై 30 ఏళ్ల వ్యక్తి అత్యాచారం

- ఆడిస్తానంటూ తీసుకెళ్లి ఘాతుకం
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 21: మూడేళ్ల బాలికపై 30 ఏళ్ల వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో నేపాల్‌కు చెందిన వ్యక్తి వాచ్‌మన్‌గా పని చేస్తూ భార్య.. మనుమరాలు(కొడుకు కూమార్తె)తో కలిసి ఉంటున్నాడు. అదే అపార్ట్‌మెంట్‌లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్ జిల్లాకు చెందిన 30 ఏళ్ల వ్యక్తి పెయింటింగ్ పని కోసం వచ్చాడు. అతను వాచ్‌మన్ మూడేళ్ల మనుమరాలిని ఆడిస్తానని చెప్పి.. రూంలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారి ఏడుస్తుండటంతో వాచ్‌మన్ వెళ్లి చూసి.. మనుమరాలిని ఎత్తుకుని వెంటనే పోలీసులకు సమచారం అందించారు. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ వెంటనే అక్కడికి వెళ్లి, చిన్నారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. అయితే, అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడు పొన్నాల సమీపంలోని బ్రిడ్జి వద్ద పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా, అరెస్ట్ చేశారు. నిందితుడిపై ఫోక్సోతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి


మృతి చెందిన హరీశ్ , హరీశ్(ఫైల్)

కంది, ఆగస్టు 21: స్నేహితులతో మద్యం సేవించిన యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఈ సంఘటన కంది మండల పరిధిలోని చేర్యాలలో బుధవారం చోటు చేసుకున్నది. చేర్యాల గ్రామానికి చెందిన మాద హరీశ్(28) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఆ గ్రామ శివారులోని వెంచర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిలో స్నేహితులతో కలిసి మద్యం సేవించాడు. మద్యం సేవించిన తర్వాత స్నేహితులు ఇంటికి వెళ్లగా.. హరీశ్ అక్కడే పడుకున్నాడు. బుధవారం ఉదయం ఆ ఇంటి యజమానికి గోడలకు నీళ్లు కొట్టేందుకు వెళ్లి చూసేసరికి హరీశ్ నిర్జీవంగా కనిపించాడు. ఇంద్రకరణ్ పోలీసులకు, గ్రామస్థులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ తరలించారు. హరీశ్ గుండెపోటుతో చనిపోయాడని ఇంద్రకరణ్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..


చిక్కుడు కిరణ్ మృతదేహం

వర్గల్, ఆగస్టు 21: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణానికి చెందిన చిక్కుడు కిరణ్(30)తో పాటు నలుగురు యువకులు వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారిపై ఫ్లెక్సీలు కట్టేందుకు కూలీ పనికి వచ్చారు. 7హిల్స్ హోటల్ సమీపంలో అర్ధరాత్రి సమయంలో కిరణ్‌తో పాటు మరో యువకుడు ఫ్లెక్సీలు పట్టుకుని రాజీవ్ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం కిరణ్‌ను వెనక నుంచి ఢీకొనడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్..


మృతిచెందిన స్వామి

సిద్దిపేట క్రైం, ఆగస్టు 21: బైక్‌పై అతివేగంగా వెళ్తూ విద్యుత్ స్తంభానికి ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన గుర్జకుంట స్వామి(30) సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి నుంచి ముస్తాబాద్ చౌరస్తా వైపు బైక్‌పై వేగంగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో సాయిబాబా గుడి వద్ద రోడ్డుకు ఎడమవైపున ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహానికి పంచనామా విధించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కూతురు(4) ఉన్నది.

పెళ్లికి ఆర్థిక ఇబ్బందులు.. యువకుడి ఆత్మహత్య


రావెల్లి రాజు (ఫైల్)

మనోహరాబాద్, ఆగస్టు 21: ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. మరో పక్క ఆర్థిక ఇబ్బందులు.. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో తోచని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మనోహరాబాద్ మండలం కోనాయిపల్లి పీటీ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోచయ్య, వీరమణిలకు ఇద్దరు కూమార్తెలు ఉండగా, పెళ్లి చేసి పంపించారు. ఓ కుమారుడు రావెల్లి రాజు (21) ఉన్నాడు. కూలి పనులు చేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. అతనికి పెళ్లి చేయాలని సంబంధాలు చూస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమే కావడంతో అప్పు కోసం ప్రయత్నించినా దొరకలేదు. ఈ క్రమంలో మంగళవారం తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లగా ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. తల్లిదండ్రులు వచ్చి చూసి.. వెంటనే తూప్రాన్‌లోని ప్రభుత్వ ఆస్పతికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సుప్రీం కోర్టు తీర్పును ఉపసంహరించుకోవాలి

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం ఇచ్చిన భారత్ బంద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతమైంది. కిరాణా, వర్తక, వాణిజ్య, వస్త్ర వ్యాపార, విద్యా సంస్థలను బంద్ చేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాలు, పార్టీల నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ పేరుతో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



నారాయణరావుపేటలో జీపీ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు


నంగునూరు: పాఠశాలను బంద్ చేయిస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు



కొండపాక ప్రభుత్వ కళాశాల తరగతులను బహిష్కరించిన మాల మహానాడు సభ్యులు


మద్దూరులో నినాదాలు చేస్తున్న నాయకులు


చిన్నకోడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు


చేర్యాలలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న రాష్ట్ర మాలమహానాడు నాయకులు


హుస్నాబాద్ బస్‌డిపో ఎదుట ఆందోళన చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

హరీశ్‌రావును విమర్శించే హక్కు లేదు

● సిద్దిపేట బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 21: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అధికారంలో ఉన్నప్పుడు సిద్దిపేట జిల్లాకు మంజూరు చేసిన వెటర్నరీ కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు తీసుకువెళ్తే ప్రశ్నించ లేని మైనంపల్లికి హరీశ్‌రావును విమర్శించే హక్కు లేదని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రవీణ్, మల్లికార్జున్, నాగరాజురెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ.. హరీశ్‌రావులాంటి పెద్ద నాయకుడిని విమర్శించి రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిల దృష్టిలో పడేందుకే మైనంపల్లి హనుమంతరావు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సిద్దిపేటకు మైనంపల్లి హనుమంతరావు రావాలనుకుంటే అభివృద్ధి కోసం నిధులు తీసుకుని రావాలని, ప్రశాంతంగా ఉన్న సిద్దిపేటలో చిచ్చు పెట్టడానికి రావద్దని సూచించారు. మల్కాజిగిరిలో చెల్లని రూపాయి, కిరాయి మనుషులతో సిద్దిపేటకు వస్తే ఇక్కడ చెల్లుతుందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు శోభ, అనూష, విజయ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు ప్రవీణ్, మల్లికార్జున్, నాగరాజురెడ్డి

రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలం

● ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 21: రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైనందున రైతులు, ప్రజాప్రతినిధులతో కలిసి నేడు భారీ ర్యాలీ నిర్వహిస్తామని, ఈ ర్యాలీ 9గంటలకు ప్రారంభమవుతుందన్నారు. రైతులు ప్రజా ప్రతినిధులు, నాయకులు, యువకులు భారీగా హాజరై ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కేవలం 40శాతం మందికి రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని, ఇంకా 60 శాతం మంది రైతులకు రుణాలు మాఫీ జరగాల్సి ఉందని చెప్పారు. రైతుల రుణమాఫీ విషయంలో ప్రభుత్వం సవాలక్ష ఆంక్షలతో రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నదని మండిపడ్డారు. రుణమాఫీ కాక రైతులందరూ రోడ్లెక్కి గగ్గోలు పెడుతున్నారని, బ్యాంకర్ల చుట్టూ, అగ్రికల్చర్ ఆఫీసర్ల చుట్టూ నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కి యోద్దీన్, ఎంపీపీ పాండు రాష్ట్ర యూత్ నాయకుడు జుబేర్, పార్టీ మండల అధ్యక్షుడు పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, నూనే కుమార్‌యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

60 తులాల వెండి అపహరణ

గజ్వేల్, ఆగస్టు 21: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని శ్రీసాయినగర్‌లోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు 60తులాల వెండి నగలను ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన చిందం ప్రవళిక తమ స్వగ్రామమైన సూరంపల్లికి ఈ నెల 17న వెళ్లారు. తిరిగి ఈ నెల 21న వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ ఇంట్లోని 60తులాల వెండి నగలు పోయినట్లు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

సిద్దిపేట రూరల్, ఆగస్టు 21: సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, సిద్దిపేట రూరల్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసిన సంఘటన బుధవారం రాత్రి సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి శివారులో చోటుచేసుకున్నది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగుండవెల్లి శివారులో ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేసి అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఒకరు పరారయ్యారు. వారి నుంచి రూ. 2,680ల నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కొండపాక, ఆగస్టు 21: కొండపాకకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎర్రోళ్ల కనకయ్యకు రూ. 60 వేలు, ఎర్రబోయిన షామలకు రూ. 20,500, రమాదేవికి రూ. 16 వేలు, గుమ్మడిదల కృష్ణకు రూ. 13 వేల విలువగల చెక్కులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అంబటి బాలచంద్రం గౌడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ములుగు, ఆగస్టు 21: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎర్రన్న కనకయ్య కుటుంబసభ్యులకు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ హరిబాబు, మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, నాగేష్, దశరథ, కనకయ్య పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేట క్రైం, ఆగస్టు 21: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలోని పలుచోట్ల వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 8 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బుధవారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ చేసి 8మందికి రూ .11,200 జరిమానా విధించారు.

తైబజార్ వేలం వాయిదా

కుకునూరుపల్లి, ఆగస్టు 21: కుకునూరుపల్లి తైబజార్ వేలంపాట వాయిదా వేసినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు.

సిద్దిపేటలో న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి

సిద్దిపేట క్రైం, ఆగస్టు 21: సిద్దిపేట జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ సీనియర్ సిటిజన్‌డే సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎన్జీవోస్ భవన్‌లో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి హాజరై మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్‌కు సంబంధించి చట్టాల గురించి తెలియజేశారు. ఎటువంటి సమస్యలు ఉన్నా వాటి పరిష్కారం కోసం జిల్లా న్యాయసేవా సంస్థను సంప్రదించాలని తెలిపారు. లాయర్‌ను పెట్టుకునే స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాది సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

ఊర చెరువుకు త్వరలో మరమ్మతులు

● ఎంపీడీవో వెంకటేశ్వర్లు

కుకునూరుపల్లి, ఆగస్టు 21: తిప్పారం ఊర చెరువు మత్తడికి బుంగపడి రెండు రోజుల నుంచి నీరు వృథాగా పోతున్నది. గ్రామస్థులు నీటికి అడ్డంగా ఇసుక సంచులు, మట్టిని పోసినప్పటికీ ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహానికి కొట్టుకుపోతున్నాయి. సమస్యను ఎంపీడీవో వెంకటేశ్వర్లు, నీటి పారుదలశాఖ అధికారి శ్రీనివాస్ దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా బుధవారం వారు ఊర చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి మాధవిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మమత, సాయికుమార్ పాల్గొన్నారు.

ఆరోపణలు రుజువు చేసేందుకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సిద్ధమా?

● యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శేఖర్

గజ్వేల్, ఆగస్టు 21: యూఎస్ఎఫ్ఐపై చేసిన వసూళ్ల ఆరోపణలు రుజువు చేసేందుకు ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధమా అని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాచారం శేఖర్ సవాల్ విసిరారు. గజ్వేల్ పట్టణంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. యూఎస్ఎఫ్ఐ ఎదుగుదలను చూసి ఓర్వలేక ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపణలకు దిగుతున్నారని ఆరోపించారు. అక్రమాలకు, వసూళ్లకు పాల్పడినట్లు నిరూపించేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. బహిరంగ చర్చకు రావాలని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం సంఘాలు పెట్టాల్సిన అవసరం ఎవరికీ లేదని, ఎవరి ప్రజాస్వామ్యం వారికి ఉంటుందన్నారు. వెంటనే ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆముదాల రంజిత్‌రెడ్డి, దాసరి ప్రశాంత్‌లు తమ ఆరోపణలను వెనుక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ప్రవీణ్, యాదగిరి, శ్రవణ్, సందీప్, వినయ్, స్వామి, భూపాల్, సంపత్, శివ, నరేశ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ ఆర్‌సీపూర్ అధ్యక్షుడిగా రాజు



కోహెడ, ఆగస్టు 21: మండలంలోని రామచంద్రాపూర్‌కు చెందిన బత్తుల రాజు కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. నియామక పత్రాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య చేతుల మీదుగా బుధవారం అందుకున్నారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా ముక్కల అరవింద్, ప్రధాన కార్యదర్శిగా అన్నాడి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా మహేందర్, ప్రచార కార్యదర్శిగా రంజిత్, సహాయ కార్యదర్శిగా అజయ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా లక్ష్మణ్ ఎన్నికయ్యారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నర్సారెడ్డి, ప్రతాప్‌రెడ్డి

కుకునూరుపల్లి, ఆగస్టు 21: మండల కేంద్రంలో కురుమ, యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహంకాళి, బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపనలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. వీరికి అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. వారివెంట పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

జీపీ వాటర్‌మెన్ మృతి

చేర్యాల, ఆగస్టు 21: చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ వాటర్‌మెన్ దుబ్బాక చంద్రయ్య (50) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి పల్లె రజిత మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

సామాజిక సేవ చేయాలి

చిన్నకోడూరు, ఆగస్టు 21: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా చేయాలని సిద్దిపేట మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రద్ధానందం అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 , సిద్దిపేట మున్సిపల్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ రెండో యూనిట్ 30 మంది వలంటీర్లు బోటింగ్ మెట్ల వద్ద ఉన్న చెత్తాచెదారం, వాటర్, బీరు బాటిళ్లు, గాజు పెంకులు, ప్లాస్టిక్ గ్లాసులను, ఇతర ప్లాస్టిక్ వస్తువులను, మెట్ల వద్ద పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో వలంటీర్లు భాను, నవీన్, నిఖిల్ రాజ్, నాగరాజు, మున్సిపల్ జవాన్ మల్లేషం, అధ్యాపకులు రఘుపతి, దేవదాస్ ఉన్నారు.


పిచ్చి మొక్కలను తొలగిస్తున్న వలంటీర్లు

విద్యుత్‌శాఖ ఎస్‌ఈగా చంద్రమోహన్

సిద్దిపేట టౌన్, ఆగస్టు 21: సిద్దిపేట జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్‌గా టీఆర్. చంద్రమోహన్‌ను నియమిస్తూ టీజీఎస్‌పీడీసీఎల్‌శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్ఈగా టీఆర్ చంద్రమోహన్ బాధ్యతలు చేపట్టారు.

జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారిగా రాధికకు అదనపు బాధ్యతలు

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 21: చేర్యాల ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న రాధికకు జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడి డీఏవో గతంలో సస్పెండ్ అయ్యారు.

దౌల్తాబాద్ వ్యవసాయశాఖ అధికారిగా..

దౌల్తాబాద్, అగస్టు 21: దౌల్తాబాద్ వ్యవసాయశాఖ అధికారిగా సాయికిరణ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడి విధులు నిర్వహించిన గోవిందరాజులు కుకునూరుపల్లి మండల వ్యవసాశాఖధికారిగా బదిలీపై వెళ్లారు. వ్యవసాయాధికారికి ఏఈవోలు శుభాకాంక్షలు తెలిపారు.

కుకునూరుపల్లి వ్యవసాయ అధికారిగా..

కుకునూరుపల్లి, ఆగస్టు 21: కుకునూరుపల్లి మండల మొట్టమొదటి వ్యవసాయ అధికారిగా గోవిందరాజు బాధ్యతలు చేపట్టారు. దౌల్తాబాద్ మండలంలో వ్యవసాయశాఖ అధికారిగా పనిచేస్తున్న గోవిందరాజు కుకునూరుపల్లికి వచ్చారు. ఉమ్మడి కొండపాక మండల అధికారిగా విధులు నిర్వర్తించిన ప్రియదర్శిని బదిలీపై వెళ్లారు.

కొండపాక వ్యవసాయ అధికారిగా..

కొండపాక, ఆగస్టు 21: కొండపాక మండల వ్యవసాయ శాఖ అధికారిగా శివరామకృష్ణ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ప్రియదర్శిని జిల్లా కార్యాలయానికి బదిలీ అయ్యారు.కొండపాక మండలానికి శివ రామకృష్ణ బదిలీపై వచ్చారు.

రాయపోల్ వ్యవసాయ అధికారిగా..

రాయపోల్, ఆగస్టు 21: మండల వ్యవసాయాధికారిగా ప్రద్యుమ్న నియామకమయ్యారు. ఆమె కమిషనరేట్ నుంచి బదిలీపై పీఎటు ఏడీఏగా గజ్వేల్‌కు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఆమెను రాయపోల్ మండలానికి ఇన్‌చార్జి ఏవోగా నియమించారు.

'బెల్టుషాపులను మూసివేయాలి'

గజ్వేల్, ఆగస్టు 21: ప్రజలకు ప్రాణసంకటంగా మారి కుటుంబాలను అప్పుల పాలు చేస్తున్న బెల్టుషాపులను వెంటనే తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా గ్రామం, పట్టణం, గుడి, బడి తేడా లేకుండా ప్రతీ గ్రామంలో నాలుగు నుంచి పది బెల్టుషాపులు ఉన్నాయని, వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డ్వాక్రాసంఘాలు, మహిళా సంఘాలతో కలసి ప్రత్యక్ష కార్యాచరణ పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని బెల్టుషాపులను తొలగించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట..


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట చెత్త

గజ్వేల్, ఆగస్టు 21: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న చెత్త గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. గజ్వేల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేసీఆర్ క్యాంపు కార్యాలయానికి నిత్యం వందలాది మంది ప్రజలు వస్తుంటారు. కార్యాలయం ఎదుట ఉన్న చెత్తను తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, ఆగస్టు 21: రెగ్యులర్ విద్యను చదువుకోలేని యువతీ, యువకులు, వయోజనులకు ఎంతగానో ఉపయోగపడే సార్వత్రిక విద్యను సద్వినియోగం చేసుకోవాలని, ఈమేరకు 2024-25విద్యాసంవత్సరానికి ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని చేర్యాల పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ హెచ్ఎం నాగమణి, సహాయ సమన్వయ కర్త సత్రం రాధిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14-15సంవత్సరాలు నిండిన వారు సెప్టెంబర్ 10వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9550558875 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

● గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి

వర్గల్, ఆగస్టు 21: మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, విద్యాలయం ప్రిన్సిపాల్ రాజేందర్, అధ్యాపకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** విద్యతోనే వివేకం పొందుతారని, బడిఈడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్ అన్నారు. చేర్యాల మండలం వేచరేణి శివారు ఎల్లదాసునగర్ ప్రభుత్వప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు స్టేషనరీని ప్రోత్సాహకంగా అందించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

● **రాయపోల్:** నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాయపోల్ ఎస్ఐ రఘుపతి సూచించారు. వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం షీటీంతో కలిసి మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీటీమ్స్, సైబర్ నేరాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


వర్గల్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

రోటవేటర్‌లో పడి తెగిపోయిన కాలు

నంగునూరు, ఆగస్టు 21: మండలంలోని సీతారాంపల్లి తండాలో రోటవేటర్‌లో పడి ఓ యువకుడి కాలు తెగిపోయింది. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన వివరాలు గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లావుడ్యా శ్రీకాంత్(22) ఇటీవల తమ రోటవేటర్‌ను రిపేర్ చేయించాడు. దున్నడం కోసం రిపేరు చేసిన రోటో వెయిటర్‌ను లావుడ్యా శ్రీకాంత్ తన స్నేహితుడు అజ్మీర శ్రీకాంత్‌తో కలిసి పరిశీలిస్తున్నాడు. అజ్మీరా శ్రీకాంత్ ట్రాక్టర్ డ్రైవింగ్ సీట్లో కూర్చుని ఉండగా లావుడ్యా శ్రీకాంత్ రోటవేటర్ ట్రాక్టర్‌కు మధ్యలో నిలుచుని పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో అజ్మీర శ్రీకాంత్ ట్రాక్టర్ గేర్‌ను మార్చబోయి పొరపాటున రివర్స్ గేరుకు బదులుగా ముందుకు వెళ్లే గేరును వేశాడు. దీంతో ట్రాక్టర్ ముందుకు కదిలింది. ట్రాక్టర్ రోటవేటర్‌కు మధ్యలో ఉన్న లావుడ్యా శ్రీకాంత్ కాలు రోటవేటర్‌లో పడి తెగిపోయింది. చుట్టుపక్కల రైతుల సాయంతో కుటుంబసభ్యులు శ్రీకాంత్‌ను ఆసుపత్రికి తరలించారు.

రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దు

● గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్

గజ్వేల్/మద్దూరు, ఆగస్టు 21: రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం రైతుల నుంచి రుణమాఫీకి సంబంధించిన అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు రెండు లక్షల వరకు అన్ని అర్హతలు ఉన్న రైతుల రుణాలను మాఫీ చేసినట్లు తెలిపారు. రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొన్ని సాంకేతిక కారణాలతో రుణమాఫీ జరుగలేదన్నారు. అర్హత ఉన్న రైతులు నుంచి గ్రీవెన్స్‌లను దరఖాస్తులను స్వీకరించనున్నామని తెలిపారు. మండల స్థాయిలో అర్జీల స్వీకరణకు నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. గజ్వేల్ మండలంలో ఏవో నాగరాజు (7288894470), కొండపాక- శివరామకృష్ణ (8499912726), కుకునూరుపల్లి- గోవిందరాజులు (9948781551), రాయపోల్- ప్రద్యుమ్న (7288894805) నెంబర్లకు సంప్రదించి, వివరాలను అందజేయాలని గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్ సూచించారు. రుణమాఫీపై రైతులు ఆందోళన చెందవద్దని, రుణమాఫీ కానివారు మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏవో రామకృష్ణ సూచించారు. ఈ విషయమై ఏవో బుధవారం మాట్లాడారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానివారు బ్యాంకు స్టేట్‌మెంట్‌తో పాటు పట్టాపాసుస్తకంతో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు రాకేష్, అఖిల్, కల్పన, రాధిక, అనూష ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు


చేర్యాల: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

చేర్యాల/గజ్వేల్, ఆగస్టు 21: చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని ఎంపీపీఎస్ ఉపాధ్యాయులు తాటికొండ యాదయ్య, ఇంద్రసేనారెడ్డి, గొంటి బుచ్చయ్య, ఉప్పల భాస్కర్, సందిటి సులోచన, కామిడి రత్నమాల ఇటీవల బదిలీ అయిన నేపథ్యంలో బుధవారం వీడ్కోలు సన్మానసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీఎస్ఎస్ హెచ్ఎం అయిలయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మేడిచెల్మి అయోధ్య, సీపీఐ జిల్లాకార్యవర్గసభ్యుడు అందె అశోక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తోళ్ల రాజేశ్వరి, కొంక శశిధర్, నాగమల్ల కృష్ణమూర్తి, టీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా 14ఏళ్ల పాటు పనిచేసిన పద్మావతికి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మదునాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. 14ఏళ్లుగా పాఠశాలలో పనిచేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఉపాధ్యాయురాలు పద్మావతి విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను అందజేశారు. వారితో ఉపాధ్యాయురాలు రహేలా, కల్పన, వీవో కళ్యాణి, అంగన్‌వాడీ టీచర్ పద్మ ఉన్నారు.

'సాంకేతికతతో కూడిన విద్యను అలవర్చుకోవాలి'

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 21: విద్యార్థులు సాంకేతికతతో కూడిన విద్యను అలవర్చుకోవాలని జెడ్ ఎఫ్ టెక్నాలజీ సెంటర్ ఇండియా, గ్లోబల్ టాలెంట్ మేనేజర్, అడ్వైజర్ సతీష్ కుమార్‌రెడ్డి సూచించారు. ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, జేఎన్టీయూ హైదరాబాద్ ఇంజినీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎ.వినయబాబు, ప్లేస్మెంట్ ఆఫీసర్ ప్రణయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రాజు, కళాశాల సిబ్బంది పాండురంగం, అస్మా జెబిన్, కల్పన, పీఆర్‌వో రఘు, అధ్యాపక బృందం విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ముగిసిన ఆలయ వార్షికోత్సవం


సామూహిక కుంకుమార్చనలో మహిళలు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 21: సిద్దిపేట హరిప్రియనగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు కొనసాగిన వార్షికోత్సవ కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా సాగాయి. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ ఆచార్య, రవి ఆచార్య పర్యవేక్షణలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమార్చన, గణపతికి విశేష అర్చన చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాంరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి'


ఏవో పరుశురామ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఫర్టిలైజర్ డీలర్లు

సిద్దిపేట రూరల్,ఆగస్టు 21: రైతులు వర్షకాలంలో వేసిన పంటల వివరాలను వదశాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఈవోలను ఏడీఏ పద్మ ఆదేశించారు. నారాయణరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బదిలీపై వచ్చిన మండల వ్యవసాయ అధికారి పరుశురామ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. అనంతరం పరుశురామ్‌రెడ్డిని నారాయణరావుపేట ఫర్టిలైజర్ డీలర్లు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఈవోలు స్పందన, మౌనిక, వరుణ్, సంధ్య, ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు. సిద్దిపేట రూరల్ మండలానికి నూతనంగా వచ్చిన మండల వ్యవసాయ అధికారి నరేష్‌కి సిద్దిపేట రూరల్ మండలం ఫర్టిలైజర్ డీలర్లు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏడిఏ పద్మ, సిద్దిపేట రూరల్ మండలం ఫర్టిలైజర్స్ డీలర్లు మారెడ్డి నరేందర్‌రెడ్డి, మహేష్, వెంకటేశ్వర్లు, రాజు, శేఖరం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మండలంలోని వెలికట్ట, ఆరేపల్లి మధ్య ఉన్న రోడ్డు వర్షం పడిందంటే చాలు చిత్తడిగా మారుతున్నది. ప్రజలు కాలినడక నడవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులు చేపట్టి బాగు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మాజీ అధ్యక్షుడు అమ్ముల బాల్ నర్సయ్య ఆధ్వర్యంలో బుధవారం రోడ్డుపై వరి నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాల్ నర్సయ్య మాట్లాడుతూ.. జనగామ రోడ్డు నుంచి వెలికట్ట గ్రామం ఆరేపల్లి మీదుగా రాజీవ్ రహదారికి ఉన్నటువంటి రోడ్డును పట్టించుకునే వారే లేరన్నారు. అధికారులు ప్రభుత్వం స్పందించి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

- కొండపాక